క్లుప్తంగా

గర్భిణుల ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ

నందిగామ: గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గర్భిణి వైద్యుల సలహాల మేరకు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని లింగాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు నవీన సూచించారు. పీహెచ్‌సీ ఆవరణలో గురువారం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు అవసరమైన అన్ని పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు నవీన మాట్లాడుతూ రక్తహీనత వలన కలిగే నష్టాలను వివరించారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం వలన పుట్టే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు. సాధారణ ప్రసవం ఎంతో మంచిదని, ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. మాత, శిశు మరణాలను నిరోధించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ నేపథ్యంలోనే ఎప్పటికప్పుడు గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

గణపతి ఆలయాలలో ప్రత్యేక పూజలు

నందిగామ: సంకటహర చతుర్థి నేపథ్యంలో గురువారం గణపతి ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణంలోని పాత బస్టాండ్, కాకులయ్య వీధిలో గల గణపతి ఆలయాలలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో గల విఘ్నేశ్వర ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు వార్షిక బడ్జెట్ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం

నందిగామ: నగర పంచాయతీ వార్షిక బడ్జెట్ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరుగుతుందని కమిషనర్ డాక్టర్ జయరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో వార్షిక బడ్జెట్‌కు సంబంధించిన అంశాలపై చర్చించి ఆమోదిస్తారన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయం ముస్తాబు



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేం చేసి ఉన్న భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఈ నెల 15 నుంచి ప్రారంభమవటంతో అధికారులు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. నది ఒడ్డునున్న ముక్తేశ్వర స్వామి వారి ఆలయానికి రంగులు తీర్చిదిద్దుతున్నారు. ఆలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 18న మహాశివరాత్రి కావడంతో 15 నుంచి 23 వరకు మహాశివరాత్రి మహోత్సవాలు జరుగనున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ నాగరాజు చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి లక్ష్మణ ఇందిరా దత్ పర్యవేక్షణలో ఆలయానికి విద్యుత్ సౌకర్యంతో పాటు భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాలకు ఏర్పాటు చేస్తున్నారు.

11న లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల రజతోత్సవం

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సిల్వర్ జూబిలీ వేడుకలు ఈ నెల 11న కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మైలవరంలోని కళాశాల ప్రాంగణంలో గురువారం జరిగిన సావేశంలో జయప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల 180 మంది విద్యార్థులతో మొదలై నేడు 5000 మంది విద్యార్థులకు చేరువైందన్నారు. రానున్న మరి కొద్ది రోజుల్లోనే యూనివర్సిటీ చేసే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు.

కనులపండువగా సుబ్రహ్మణేశ్వరుని కల్యాణం

తోటమూల(గంపలగూడెం): మండలంలోని తోటమూల శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం 23వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చక బృందం సుబ్రహ్మణేశ్వర స్వామికి ముందుగా అభిషేకం భక్తి శ్రద్ధలతో జరిపారు. అనంతరం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి కల్యాణాన్ని కనులు విందుగా నిర్వహించారు.

రోయింగ్ క్రీడాభివృద్ధికి సహకారమివ్వండి

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్రంలో రోయింగ్ క్రీడను అభివృద్ధి చేసేందుకు సమకారమందించాలని ఏపీ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) వీసీ, ఎండీ కె.హర్షవర్ధన్‌ను ఏపీ స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఖేలో ఇండియా సౌత్‌జోన్ సభ్యుడు తరుణ్ కాకాని కోరారు. శాప్ ఎండీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన హర్షవర్ధన్‌ను గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు.

పట్టణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

- రూ.20 లక్షలతో మూడు సీసీ రోడ్ల నిర్మాణం
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నందిగామ పట్టణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణంలోని ఎనిమిదవ వార్డులో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పంచాయతీ సాధారణ నిధులు రూ.15 లక్షలు, ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో రూ.5 లక్షలతో మూడు సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నందిగామ పట్టణాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. పట్టణంలోని 20 వార్డులలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఇప్పటికే ప్రధాన రహదారులు, అత్యంత అవసరమైన వార్డులలో రూ.15 కోట్లతో డ్రైన్‌లు ఏర్పాటు చేసి మురుగునీటి పారుదల సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులను సైతం విస్తరించి అభివృద్ధి చేస్తున్నామని, అందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. 20 వార్డులలోని అంతర్గత రహదారులను ప్రాధాన్యతాక్రమంలో సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ మాడుగుల నాగరత్నం, కమిషనర్ జయరాం, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, పాకాలపాటి కిరణ్, యాకుబ్ వలి, దాసు, జాఫర్, విశ్వనాథపల్లి కృపారావు, బండారు శేషు, పోతురాజు, పిల్లి జయరాజు, శేఖర్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్న సీఎం జగన్

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



పరిటాలలో ప్రభుత్వ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం ఆశయమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పరిటాల గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పాదయాత్రతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ, దేశ చరిత్రలోనే ప్రజలకిచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ అన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు. ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడం, అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయటంతో పాటు ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, ఎంపీటీసీ సభ్యురాలు కర్ల రాధిక, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, వేముల జీవరాజు, జాన్‌బాబు, జమలయ్య, నరసింహారావు, కర్ల రామకృష్ణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, ఎంపీడీఓ బాలశంకరరావు, ఏపీఎం కోట భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్లు సమర్థంగా పనిచేయాలి



వలంటీర్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎంపీపీ గాంధీ

పెనుగంచిప్రోలు: వలంటీర్లు సమర్థవంతంగా పనిచేయాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పెనుగంచిప్రోలు, వెంగనాయకునిపాలెం గ్రామాలకు సంబంధించి నలుగురు వలంటీర్లకు నియామకపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలాగా వ్యవహరించాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

కమిషనర్ జయరాం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

నందిగామ: ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ లబ్ధిదారులు శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని నగర పంచాయతీ కమిషనర్ జయరాం సూచించారు. మండల పరిధిలోని మునగచర్ల గ్రామ పరిధిలో ఏర్పాటుచేసిన జగనన్న కాలనీల లబ్ధిదారులతో ఆయా కాలనీల వద్ద గురువారం ప్రత్యేక సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారుల కోసం ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ, ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసుకుని, సొంతింటి కల నెరవేర్చుకోవాలన్నారు. లేఅవుట్లలో అవసరమైన మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తోందని, ప్రతి ఒక్కరూ సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, గృహ నిర్మాణ శాఖాధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సత్కారం



పాఠశాల యాజమాన్యం నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అజయ్‌కుమార్

నందిగామ(చందర్లపాడు):విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమని, అటువంటి క్రీడలపై విద్యార్థులకు ఆసక్తి పెంచడంలో వ్యాయామ ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ప్రధానోపాధ్యాయురాలు సువర్చల అన్నారు. మండలంలోని మునగాలపల్లి గ్రామంలో సెయింట్ లూసీ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వేమూరి అజయ్ కుమార్‌ను గురువారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు క్రీడలలో ఇటీవల జాతీయస్థాయిలో రాణించిన నేపథ్యంలో ఆర్‌సీఎం సంస్థ అజయ్ కుమార్‌కు ప్రత్యేక అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేసింది.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



మున్సిపల్ కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ మున్సిపల్ కూడలిలో గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, బడ్జెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు కోట కృష్ణ మాట్లాడుతూ బడ్జెట్‌లో వ్యవసాయం, ఎరువులు, జాతీయ ఉపాధిహామీ పథకం, ఆహార సరఫరా, ధాన్యం కొనుగోలు, గృహ నిర్మాణాలు వంటి వాటకి కోత విధించారని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజల నోళ్లను కొట్టి బడా పారిశ్రామికవేత్తలకు దోసి పెట్టేదిలా బడ్జెట్ ఉందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం కావాలని బీజేపీ పాలిత రాష్ట్రాలకు నిధుల కేటాయింపు ఎక్కువగా ఇచ్చి, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రానికి నిధుల కేటాయింపు లేకుండా చేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టు, ఐఐటీ, విశాఖ రైల్వే ఊసే కేంద్ర బడ్జెట్‌లో లేదన్నారు. సీపీఎం పేట మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి, నాయకులు కాకనబోయిన లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు, షేక్ గౌస్‌మియా, దంతాల రాజేశ్వరి, షేక్ మీరా సాహెబ్, రాంప్రసాద్, షేక్ బడేమియా, కాకనబోయిన సుబ్బారావు, కరీమా, మరియదాసు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ కుటుంబాలకు నిత్యావసరాలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని హెచ్‌ఐవీ బాధిత కుటుంబాలకు ప్రతి నెలా మాదిరిగానే ఈనెల కూడా నిత్యవసర సరుకులు అందజేసినట్లు ఎన్టీటీపీఎస్ రిటైర్డ్ డెప్యూటీ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం, హెచ్ఎంఈఎల్, మూలపాడు ప్రాంతాలకు చెందిన 35 మందికి అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఆలీ, డాక్టర్ ఆస్రా, ఎన్టీటీపీఎస్ ఏడీఈ నారాయణ ఆర్థిక సహకారంతో వీటిని సమకూర్చినట్లు తెలియజేశారు. హెచ్‌ఐవీ బాధితులు ధైర్యంతో అందుబాటులో ఉన్న మందులు వాడుతూ జీవితకాలం పొడిగించుకోవచ్చని తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



దాసాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కొటికలపూడి గ్రామంలో పునర్నిర్మించిన దాసాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠతో పాటు మహా గణపతి, కుమారస్వామి, దాసాంజనేయస్వామి, ఆలయ శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పూజలు

దాసాంజనేయస్వామి ఆలయం, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. అర్చక బృందం ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాడిపంటలు సుభిక్షంగా వర్ధిల్లుతాయని ఆయన అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వసంతను మెమెంటో అందజేసి ఘనంగా సత్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, వైస్ ఎంపీపీ బండి నాగమణి, సర్పంచి రెంటపల్లి నాగరాజు పాల్గొన్నారు.

కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు



నూతన కమిషనర్ వెంకటేశ్వర్లును అభినందిస్తున్న బదిలీ అయిన కమిషనర్ పర్వతనేని శ్రీధర్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మునిసిపాలిటీ నూతన కమిషనర్‌గా సీహెచ్ వెంటేశ్వర్లును నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ ఆదేశాలు జారీచేశారు. కొండపల్లి మునిసిపాలిటీలో వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చీరాల మునిసిపాలిటీ మేనేజర్‌గా ఇప్పటి వరకు పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన పర్వతనేని శ్రీధర్ పిడుగురాళ్ల మునిసిపాల్టీ రెవెన్యూ అధికారిగా బదిలీ అయ్యారు. నూతన కమిషనర్ వెంకటేశ్వర్లుకు ఉద్యోగులు స్వాగతం పలికి అభినందించారు. బదిలీ అయిన కమిషనర్ పర్వతనేని శ్రీధర్‌కు ఉద్యోగులు వీడ్కోలు పలికారు.

దాసాంజనేయ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం



పెద్దాపురంలో ధ్వజస్తంభానికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

పెద్దాపురం(కంచికచర్ల): వీరులపాడు మండలం పెద్దాపురంలో దాసాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితులు హరినవీన్, మణికుమార్ స్వామి వారికి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవగ్రహారాధన వంటి పూజలు చేశారు. మహిళలు ఆలయానికి పెద్ద సంఖ్యలో విచ్చేసి ధ్వజస్తంభానికి జలాభిషేకం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అగ్ని ఆరాధన, మన్యసుక్తహోమం, నీరాజన మంత్రపుష్పములు తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, సొసైటీ అధ్యక్షుడు ఆవల ప్రసాద్, కోటేరు సూర్యనారాయణరెడ్డి, సత్యనారాయణరెడ్డి మాధవి తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

కంచికచర్ల: ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి ప్రతి రోజూ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.68 లక్షల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని పరిటాలలో జల్‌జీవన్ మిషన్ పథకం జిల్లా అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు తాగునీరు నిత్యం సరఫరా అయ్యేలా అధికారులు చూడాలన్నారు. ప్రధాన పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధి, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలకు ప్రభుత్వం లక్షల కోట్ల నిధులు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, ప్రాజెక్టు సమన్వయకర్తలు కర్ల రామకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో భూముల రీ సర్వే పనులు ప్రారంభం



అల్లూరులో డ్రోన్ పనిచేసే విధానాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి తదితరులు

వీరులపాడు(కంచికచర్ల): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీ సర్వే పనులను వేగవంతం చేయాలని ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి అన్నారు. వీరులపాడు మండలం అల్లూరు గ్రామంలో గురువారం రీ సర్వే పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు భూములను రీ సర్వే చేయటం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించనుందని, దాదాపు వందేళ్ల తర్వాత దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భూముల సమగ్ర సర్వేకు చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచి బి.రాణి, మాజీ సర్పంచి కోటేరు సూర్యనారాయణరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు భాస్కరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వేమూరి ఆదాం, రాఘవరెడ్డి, మండల సర్వేయర్, గ్రామ సహాయ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణ అందరి బాధ్యత

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



బందెల దొడ్డికి తరలించిన ఆవులు

జగ్గయ్యపేట అర్బన్: గోవుల సంరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. పట్టణంలో ప్రధాన రహదారులపై తిరుగుతున్న ఆవులను గత రాత్రి బందెల దొడ్డికి తరలించినట్లు చైర్మన్ తెలిపారు. ఆవుల సంరక్షణను దృష్టిలో పెట్టుకొని ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆవుల యజమానులకు ముందస్తు జాగ్రత్తలు జారీ చేసినప్పటికీ ఆవులను రహదారుల పైకి వదలటం వలన ఆవులు ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. అవి తరచూ రోడ్లపై సంచరిస్తూ వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించడం వలన వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆవుల యజమానులు ఇక నుంచి రహదారులపై ఆవులను వదలకూడదన్నారు. ఆవుల యజమానులు నిర్లక్ష్యం వహిస్తే బందెల దొడ్డిలో బంధించిన ఆవులను గోశాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఏఐ కోఆర్డినేటర్ పద్మశేఖర్

జగ్గయ్యపేటఅర్బన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం వారు నిర్వహించు ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు గురువారం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విశ్వభారతి జూనియర్ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నక్కా బాబురావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని కళాశాలల్లోని స్టడీ సెంటర్లలో పుస్తకాల పంపిణీ చేశామన్నారు. ఏ కళాశాలలో ఫీజు కట్టిన విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే పుస్తకాలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విశ్వభారతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఏఐ కోఆర్డినేటర్ పద్మశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు ఐరన్ ట్యాబ్‌లెట్‌లు అందజేస్తున్న వైద్యాధికారి అనిల్‌కుమార్

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని భూచవరం ప్రభుత్వ వైద్యాధికారి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఫ్యామిలీ ఫిజిషియన్ (కుటుంబ డాక్టర్ విధానం) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార అలవాట్లపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి రోజూ పాఠశాలకు వచ్చే సమయంలో పరిశుభ్రంగా రావాలని సూచించారు. ముఖ్యంగా పరిశుభ్రతతో పాటు ఆహారం తీసుకునే విధానంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంతో పాటు సాయంత్రం సమయంలో కూడా పౌష్టికాహారమైన చిక్కీ అందజేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఐరన్ ట్యాబ్‌లెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హనుమంతు, హెల్త్ సూపర్‌వైజర్లు బొమ్మి వెంకట్రావ్, లివేలమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ పవన్‌కళ్యాణ్, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ రిటర్న్స్‌లో సమస్యలు పరిష్కరించాలని వినతి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జీఎస్టీ రిటర్న్స్‌లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఫెడరేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు గురువారం జీఎస్టీ చీఫ్ కమిషనర్ ఎం.గిరిజాశంకర్‌ను కుంచనపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా పిళ్లా మోహనరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 3020 విజయవాడ విభాగంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మాజీ అధ్యక్షులు పిళ్లా మోహనరావు 2023–23 సంవత్సరానికి అసిస్టెంట్ గవర్నర్‌గా నియమితులయ్యారు. విజయవాడలో గురువారం జరిగిన కార్యక్రమంలో జిల్లా గవర్నర్ దత్తా సుబ్బారావు ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు.